ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 11 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని లబ్ధిదారుడు శేఖర్‌కు మంజూరైన రూ.35 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మారెడ్డి, సాహెబ్, బాల్‌రెడ్డి, దత్తాద్రిగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, కిష్టారెడ్డి, శ్రీనివాస్, బాలపోషయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యుడు మంగళవారం వైద్య పరీక్ష నిర్వహించారు. రక్తహీనత, విటమిన్ లోపం వంటి పరీక్షలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శరత్ కుమార్, వైద్యులు లహరిక, పావని, ఫార్మసిస్టులు గౌస్, సౌజన్య, అధ్యాపకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ప్రధానోపాధ్యాయులు

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాధికారి జగన్ మోహన్‌రెడ్డిని మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంగళవారం కలిశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు తిరుపతి, గౌస్, పావని, సత్యనారాయణ, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరు బాట





సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జిల్లాలో 426 మంది సమ్మెలోకి

జిల్లాలో సమగ్ర శిక్షలో 12 విభాగాల్లో 426 మంది పని చేస్తున్నారు. డీఈవో, కేజీ బీవీ, యూఆర్ఎస్, సీఆర్‌పీ, ఎంఐఎస్, సీసీవో, మేసేజర్లు, ఐఈఆర్‌డీ ఇలా వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. ఈ నెల 6నుంచి జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. 50శాతం మంది ఉద్యోగు లు రిలే దీక్షల్లో, మరో 50శాతం మంది ఉద్యోగులు విధులకు ఇబ్బందులు కలగ కుండా పనులు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో పూర్తి స్థాయి నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో కేజీబీవీ లో విద్యాబోధన, ఇతర పనులకు ఆటం కాలు ఏర్పడ్డాయి. తమ సమస్యలు నెరవేరే వరకు ఆందోళను కొనసాగిస్తామని ఉద్యోగు లు స్పష్టం చేస్తున్నారు.

- జిల్లాలో నిరవధిక సమ్మె ప్రారంభం
- హామీలు నెరవేర్చాలని డిమాండ్
- అరకొర వేతనాలతో అవస్థలు
- సమ్మె బాటలో 426 మంది ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. రెగ్యులరైజేషన్, రెగ్యులర్ పే స్కేల్ డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. హామీలు నెరవేర్చాలని రిలేనిరాహార దీక్షలు చేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మెకు శ్రీకారం చుట్టారు. సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడంతో జిల్లాలోని విద్యా వ్యవస్థలో అనేక పనులు స్తంభించి పోయాయి.

గత ప్రభుత్వ హయాం నుంచి నిరసన

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి డిమాండ్ల సాధనకోసం విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. తమ ఆవేదనను వినిపిస్తూ ఆందోళనలు చేపట్టారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు అనేకమార్లు సమస్యలపై విన్నవించినా నెరవేరని పరిస్థితి. ఏడాది దాటినా ప్రభుత్వం పట్టించు కోక పోవడంతో నవంబరు 15న ప్రభుత్వానికి ఉద్యోగులు, సమ్మె నోటీసు ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో పోరుబాట పట్టారు. అరకొర వేతనాలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఇప్పపూల దేవయ్య, కత్తి జయలక్ష్మీ, రాజు, తుమ్మ రాజేందర్,

మిగతా 8లో

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి
- మండల స్థాయి సీఎం కప్ పోటీలు

8



మాట్లాడుతున్న చైర్ పర్సన్ కళాచక్రపాణి

ఆశావర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామికం

- సీఐటీయూ నాయకులు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

8



సిరిసిల్లలో ఆశావర్కర్లు, నాయకులు

స్థానిక నిర్మాణాలకు ఇసుక రీచ్‌లను గుర్తించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, స్థానిక, వాణిజ్య అవసరాల కోసం జిల్లాలో ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో నంబరు 3తో పాటు తెలంగాణ ఎండీసీ లక్ష్యం, తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లు ఉన్నాయో? అధికారులను అడిగి ఆరా తీశారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.100 ఉండగా రూ .160కి పెంచాలని కమిటీ ప్రతిపాదనలు చేశారు. చెక్ డ్యాంల నిర్మాణాలకు ఇబ్బంది కాకుండా ఇసుక తీయాలని ఆదేశించారు. పీసీబీ ఇతర శాఖల సమన్వయంతో ఇసుక తరలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి, డీటీవో లక్ష్మణ్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సర్వే ఏడీ వినయ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ జానకి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై ధాన్యం తొలగింపు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ధాన్యాన్ని అధికారులు మంగళవారం తొలగించారు. 'ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు' అనే శీర్షికన ఈ9న ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. ధాన్యం కుప్పలకు సంబంధించిన రైతులతో మాట్లాడి తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

కోనరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, ఈశ్వర్, చేతన్, విష్ణు, చరణ్ ఉన్నారు.

పెండింగ్ సీఎంఆర్ అప్పగించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ సీఎంఆర్ ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్, రబీ సీజన్ 2023-24 సంవత్సరానికి సంబంధిచి సీఎంఆర్, ఖరీఫ్ సీజన్ 2024-25 సీజన్ ధాన్యానికి సంబంధించి బ్యాంక్ గ్యారంటీపై బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సమావేశం అయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వానాకాలం 2024-25 సీజన్ ధాన్యానికి సంబంధించి మిల్లులో దించుకున్న మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలన్నారు. మిల్లుల వారీగా ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ఈ నెల 15వ తేదీలోగా 2023- 2024 వానాకాలం, ఎండాకాలం సీజన్‌లకు సంబంధిచి సీఎంఆర్ పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (అంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14, 15, 16వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాధిక జైశ్వాల్

వీర్నపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని జిల్లా న్యాయమూర్తి రాధిక జైశ్వాల్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై బాలికలకు అవగాహన ఉండాలన్నారు. బాలికల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చర్చలు, కౌన్సెలింగ్‌తో సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. మహిళా చట్టాల అమలుతోపాటు బాలికల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అనంతరం ర్యాగింగ్, గుడ్,బ్యాడ్ టచ్, ఫండమెంటల్ డ్యూటీస్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నతస్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్శరాములు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, తిరుపతి, పాఠశాల ప్రిన్సిపల్ అశోక్, ఎస్సై ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

12లోగా అభ్యంతరాలు అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం గుర్తించిన పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12లోగా సమర్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 260 గ్రామాల్లోని 2268 వార్డులలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశామనారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 12 లోపు తెలియజేయాలని తెలిపారు. డిసెంబరు 13న అభ్యంతరాలపై సంబంధిత మండలాల ఎంపీడీవోలు స్క్రూటినీ పూర్తి చేసి నివేదిక అందించాలన్నారు. డిసెంబరు 16 లోపు జిల్లా కలెక్టర్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని డిసెంబరు 17న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీవోల ద్వారా తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు ప్రకాష్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోపి, సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజన్న, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గంభీరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గంభీరావుపేట మండలం కొళ్లమద్దిలో మంగళవారం 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరభంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 100 డయల్‌పై పూర్తిగా అవగాహన అవసరమన్నారు. సమస్య ఎదురైతే పోలీస్ సహాయం కావల్సి వస్తే వెంటనే 100 డయల్‌కు కాల్ చేయాలన్నారు. కేవైసీ అప్డేట్ చేయాలని వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీతో వలసలు తగ్గు ముఖం



ఉపాధిహామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంతో గ్రామాల్లో వలసలు తగ్గుముఖం పట్టాయని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. గతేడాది నుంచి గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై పూర్తిస్థాయిలో చర్చించనున్నట్లు చెప్పారు. గ్రామాలలో నిర్వహించిన సమావేశాలలో కొన్ని పొరపాట్లను గుర్తించామని, మరోసారి ఇలాంటివి జరుగకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, ఏపీవో రామారావు, కుమార్, అంబుడ్స్‌మెన్ రాకేష్, జిల్లా క్యూసీ నవీన్‌కుమార్, ఎస్‌టీఎం అంజద్‌అలీ, ఎస్‌పీఎం సాయిలు, ఏఈ అజారుద్దీన్, ఏపీవో అరుణ్‌కుమార్, ఏపీఎం చంద్రయ్య, ఈసీ అర్షద్ పాల్గొన్నారు.

మహిళ క్లినిక్‌లో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పీఎస్‌నగర్‌లోని మహిళ క్లీనిక్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో వసంతరావు తనిఖీ చేశారు. క్లీనిక్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. రొమ్ము, గర్భాశయ, ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ల నమోదు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

క్రైం కార్నర్

దివ్యాంగురాలైన కూతురుని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన కన్న కూతురుని హత్య చేసిన నేరంలో నిందితుడైన కసాయి తండ్రికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మానకొండూరు మండలం తీగల గుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ (38)కి పెళ్లి కాగా కొన్నాళ్లకు ఆమె చనిపోవటంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి పాప జన్మించింది. పాప జన్మించిన ఆరు నెలల సమయంలో ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని కాళ్లు చేతులు పడిపోయాయి. ఆమెకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినా అలాగే ఉంటున్నది. ఏపని చేయక తాగుడుకు అలవాటు పడిన కొమిరె మహేందర్ బిడ్డపై వ్యతిరేకత పెంచుకొని భార్యాబిడ్డలను తరచూ వేధిస్తుండేవాడు. అతని వేధింపులు భరించలేక భావన బిడ్డను ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. ఇదే అదనుగా భావించిన మహేందర్ 2023 మార్చి1న రాత్రి దివ్యాంగురాలైన బిడ్డను హత్య చేసి కెనాల్‌లో పడేశాడు. ఈ సంఘటనపై భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్‌రావు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను ఎస్ఐ తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి వెంకటేశ్వర్లు విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన చెదలు రాజేందర్‌ను 2022 జనవరి 13న అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్, గోధుర్ గ్రామానికి చెందిన తైదపల్లి రజనీకాంత్ వ్యవసాయ పొలంలో దారి విషయంలో గొడవకు దిగి రాజేందర్‌ను కత్తులతో పొడిచి హత్య చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసిన కాస సంజీవ్ ఏ1, తైదపల్లి రజనీకాంత్ ఏ2, వీరికి సహకరించిన రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళరపు లక్ష్మీనారాయ ణను ఏ3గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన సరైన సాక్ష్యాలను పోలీసులు కోర్టులో ప్రవేశ పెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా అదనపు జడ్జి మంగ ళవారం తీర్పు వెల్లడించారు. నిందితులు కాస సంజీవ్, రజనీకాంత్ కు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఏ3 లక్ష్మీనారాయణకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా అదనపు జడ్జి తీర్పు వెల్లడించారు.

బాలికపై అత్యాచారం

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఓ యువకుడిపై పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని అలమయ్య గుట్టు ప్రాంతానికి చెందిన బాలిక(14)తో పాటు ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. సదరు బాలిక తల్లి పలు ఇళ్లలో పని మనిషిగా చేస్తోంది. కూతురు ఇంటి వద్దనే ఉండడంతో కాలనీకి చెందిన యువకుడు ఇప్ప రవి సదరు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులుగా బాలికను బెదిరింపులకు పాల్పడుతూ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. మంగళవారం విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి రవి ఇంటికి వెళ్లి నిలదీయడంతో వారిపై రవి దాడి చేసాడు. దీంతో సదరు మహిళ స్థానికుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు చేరుకొని తన కూతురుపై జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. విషయంపై కోరుట్ల సీఐ సురేష్ బాబు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం బాలికకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. ఈ విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విచారణ జరిపినట్లు సమాచారం.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దు



దర్శన టికెట్లను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మంగళవారం దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయాన్ని సందర్శించి దేవాదాయ శాఖలోకి విలీనం చేసుకుని ఈవో కాంతారెడ్డికి బాధ్యతలను అప్పగించారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆలయ పరిసరాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎళ్ల నుంచి ఆలయానికి సేవలు చేస్తూ ఆధారిపడిన వారి కుటుంబాలు రోడ్డున పడతాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విలీనం ఆపాలని కోరారు. నిర్వాహకులకు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ వారికి తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని వ్యాపారస్థులతో మాట్లాడి టికెట్ చార్జీలను తెలుసుకున్నారు. ఆలయానికి లక్షల్లో ఆదాయం వచ్చినా భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని రెండేళ్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టి ఆలయాన్ని విలీనం చేసిందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయం వద్ద బందోస్తు ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని ఆమె కోరారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసుసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలోని నేదురు ఐలమ్మ ఇంటి తాళం పగలగొట్టి రూ. 74వేల నగదు, బంగారు గొలుసులు చోరీకి గురైన సంఘటన వెలుగు చూసింది. నేదురు ఐలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి గర్రెపల్లికు వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోనే వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు తులాల బంగారు గొలుసులు, రూ. 74వేల నగదు దొంగలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఓ కుటుంబం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని కేశవపట్నం పోలీసులకు బాధితురాలు ఐలమ్మ ఫిర్యాదు చేసింది.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొత్తపల్లి రాజేశ్వరి తన ఇంటికి తాళం వేసి కథలాపూర్ మండలంలోని పోసానిపేట గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఉదయంలో ఇంటికి తిరగి వచ్చిన రాజేశ్వరి తన ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే ప్రాంతంలో ఉన్న సల్ల లక్ష్మణ్ ఇంటి తలుపులకు ఉన్న తాళం పగుల గొట్టి ఉండగా గమనించిన స్థానికులు లక్ష్మణ్‌కు సమాచారం అందించారు. లక్ష్మణ్ మూడునెలల నుంచి మెట్‌పల్లి పట్టణంలోని ఉంటున్నాడు. కొత్తపల్లి రాజేశ్వరి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు ఐదువేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మణ్ ఇంట్లో ఎంతపోయిందో రాత్రి వరకు నిర్ధారణ కాలేదు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ ద్వారా వేలిముద్రలను నమోదు చేసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్ ఇలా.. టెస్ట్ ఎలా..?



డ్రైవింగ్ టెస్టు ట్రాక్ కనిపించకుండా ఇరువైపుల పెరిగిన చెట్లు

- అసంపూర్తిగా డ్రైవింగ్ టెస్టు ట్రాక్
- 2015 ప్రారంభమైనా పూర్తికాని పనులు
- ట్రాక్ లేక నామమాత్రంగా డ్రైవింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీ కార్యాలయంతో పాటు జిల్లా రవాణా శాఖ కార్యాల యం ఉన్నది. ఇందులో 5 ఎకరాల విస్తీర్ణంలో 2015వ సంవత్సరంలో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారం భించారు. కొంత పనులు పూర్తయిన్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ట్రాక్‌కు ఇరువైపులా పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది.



ముళ్లతో చిత్తడిగా ఉన్న ట్రాక్

డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు

డ్రైవింగ్ టెస్టులో ఉత్తీర్ణత కావాలంటే ముందుగా వాహనం నడిపే వ్యక్తికి రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి. రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఉంటాయి. అలాంటి సమయాల్లో ఏ విధంగా వాహనం నడపాలనేది ప్రతి వాహనదారుడు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. కారు, ద్విచక్ర, భారీ వాహనాలు నడిపే వారికి వేరువేరుగా ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. 8 ట్రాక్ బాగా మలుపులు ఉన్న రోడ్లపై ఎలా ముందు వెళుతున్నామో తెలుస్తుంది. హెచ్‌ట్రాక్ ద్వారా వాహనం ముందుకు వెళ్లిన తరువాత రివర్స్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలా తీసుకుంటున్నారో తెలుస్తుంది. ఎస్ ట్రాక్ ఒక మూల నుంచి మరో మూలకు మలుపు కోవాల్సి వచ్చినప్పుడు ట్రాక్ ద్వారా వాహనం నడిపే వారి నైపుణ్యం తెలిసిపోతుంది. ఎత్తుపల్లాల ట్రాక్ ద్వారా లోయలు, ఎత్తు పల్లాలు వంటి ప్రాంతాల్లో వాహనం ఎలా నడుపుతారో పరిశీలిస్తారు.

అమలు కాని నిబంధనలు :

మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో నిర్ణీత ప్రమాణా ల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వారికి రవాణాశాఖ అధికారులు పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్ మంజూరు చేస్తారు. ప్రస్తుతం డ్రైవింగ్ టెస్టు ట్రాక్ అందుబాటు లోకి రాకపోవడంతో నామమాత్రంగానే కార్యాలయం సమీపంలోనే ఖాళీ స్థలంలో బండ రాళ్లను ఏర్పాటు చేసి డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం టెస్టులు నిర్వహించక పోవడంతో డ్రైవింగ్ సరిగా రాకున్నా లైసెన్స్ ఇవ్వాల్సి వస్తుందనే విమర్శ లు ఉన్నాయి. ట్రాక్ వద్ద చెట్ల పొదలతో చిత్తడిగా మారింది. అధికారులు స్పందించి ట్రాక్ చుట్టూ ఉన్న చెట్ల పొదలు తొలగించి డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు పూర్తి చేయాలని వాహన దారులు కోతున్నారు.




బండరాళ్లను ఏర్పాటు చేసి టెస్టు చేయిస్తున్న అధికారులు



ఎత్తు పల్లాల ట్రాక్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

డ్రైవింగ్ టెస్టులకు త్వరలో కొత్త టెక్నాలజీ

డీటీసీ పురుషోత్తం



ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం తెలిపింది. అప్పటి వరకు పాత పద్ధతిలోనే డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తాం. ఆటో మెటిక్ టెస్టింగ్ సెంటర్లు ఎప్పుడు వచ్చేది పూర్తిగా తెలియదు. డ్రైవింగ్ టెస్టు ట్రాక్ నిర్మాణం ఎందుకు అగిపోయిందో తెలియదు. ప్రస్తుతానికి సీనియర్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో డ్రైవింగ్ టెస్టులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) విద్యార్థుల పరిశోధన, నైపుణ్యంతో జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 4 నుంచి 7వరకు చండీఘర్‌లో జరిగే 50వ జాతీయ బయో కెమిస్ట్రి సదస్సు ఏసీబీ ఐకాన్-2024 నుంచి గోదావరిఖని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చెందిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. సాధారణంగా ఎండీ, పీహెచ్‌డీ స్థాయి విద్యార్థులు చేసే పరిశోధన ప్రదర్శనకు దీటుగా సిమ్స్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు ప్రదర్శన చేయడంపై ఐఎఫ్‌సీసీ అధ్యక్షుడు, ఏసీబీ ఐకాన్-2024 అధ్యక్షుడు డాక్టర్ ఇందు వర్మ ప్రత్యేకంగా అభినందించారు. బయోకెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ సారథ్యం లో పరిశోధన చేశారు. ఈ పరిశోధను జాతీయ సదస్సులో ప్రదర్శించారు. సాత్విక్, తిరుశి, అభిరామ్ రెడ్ టాక్సిసిటీ నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలపై బయోకెమిస్ట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోకవర్ధన్ సహకారంతో పరిశోధన ప్రదర్శన నిర్వహించారు. సృజన, హర్షవర్ధన్, సందీప్ విటమిన్-డీ, శ్వాసకోశ సం బంధిత సమస్యలు, దాని ప్రభావం అంశంపై ప్రదర్శన నిర్వహించారు. అలాగే సాల్వాజీ రిషిరావు, గోషిక అన్ను న్యూరో బయోకెమిస్ట్రిలో మెదడు, జ్ఞాపకశక్తి అంశంపై ప్రదర్శన నిర్వహించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, వైస్‌ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రి విభాగ అధిపతి డాక్టర్ నరేందర్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ జిల్లా కేంద్రంలోని అకస్మిక తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలోని స్కానింగ్ మిషన్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనాల ప్రకారం గర్భస్థ పూర్వ పిండ స్కానింగ్ పరీక్షలను నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం స్కానింగ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎన్‌జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాష్ శుక్ల పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు.. తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వాహన తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి తన బైక్‌పై అతి వేగంగా వెళుతూ మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో మండల కేంద్రంలోని వ్యక్తి చరణ్‌తో పాటు మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో చరణ్ పరిస్తితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చరణ్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్నాడు. వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయంతో బైక్‌ను వెనక్కి తిప్పి అతి వేగంగా ముందుకు దూసుకెళ్లి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో చరణ్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. చరణ్ పరిస్తితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డు పక్క నుంచి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వల్ల తప్పించుకునే ప్రయత్నంలోనే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్‌పై దాడి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ప్రయాణికుడు ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్‌లో ఓడేడు వెళ్తున్న టీఎస్02 యూఏ 9885 బస్సులో కరీంనగర్‌కు చెందిన పంపరి శివకుమార్ ఎక్కాడు. తోటి ప్రయాణికులతో గొడవకు దిగిన శివకుమార్ కాలనీ షిర్కే బస్‌స్టాప్ వద్ద నడుస్తున్న బస్ నుంచి దూకాడు. రాళ్లతో బస్ అద్దాలను ధ్వంసం చేశాడు. దాడి ఘటనపై డ్రైవర్ బొడ్డు కుమార్ గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) స్థానిక చందపల్లికి చెందిన గజరంగి పోశెట్టి తన భార్య పిల్లలతో బైక్‌పై ఈనెల 4న బందంపల్లికి వెళుతుడగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో తులం చెవికమ్మలు, మాటీలు ఉన్నయని ఎస్సై లక్ష్మణ్‌రావుకు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై విచారిస్తుండగా శాంతినగర్ పెట్రోల్ బంక్ దగ్గర్లో పంక్చర్ షాప్ నడుపుకునే ఎండీ అఫ్జల్ తనకు హ్యాండ్ బ్యాగ్ దొరికిందని పోలీసులకు అప్పగించాడు. పెద్దపల్లి ఏసీపీ సమక్షంలో బ్యాగ్‌లో ఆభరణాలతో బాధితులకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న అఫ్జల్‌ను ఏసీపీ కృష్ణ మంగళవారం సన్మానించారు.

23క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులోని బెండ బుడగజంగ కాలనిలో గల ఓ డేరాలో అక్రమంగా నిల్వ ఉంచిన 23.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల రామస్వామి అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీస్‌లు గుర్తించారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

తండ్రి, కూతురు అరెస్టు

చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలో తండ్రితోపాటు కూతురును అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జాగిరి నర్సయ్య తనకు చెందిన ఇల్లును అతనికి తెలియకుండానే తన అన్న అయినా జాగిరి పర్శరాములు, కూతురు జాగిరి మానస, నేరెళ్ల రమేష్ కలిసి మానస పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని పిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా జాగిరి పర్శరాములు, జాగిరి మానసలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించాగా, నేరెళ్ల రమేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణిలో మహిళా అధికారులు



- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక

నేటి ఆధునిక సమాజంలో మహిళ ఒక పైలట్‌గా, అంతరిక్ష వ్యోమగామిగా, డాక్టర్‌గా, పోలీసుగా, రాజకీయ నాయకురాలిగా ఇలా అన్ని రంగాల్లో రాణిస్తోంది. మహిళలు మగవారికి దీటుగా 'సరిలేరు స్త్రీకెవ్వరు' అన్నట్లుగా దూసుకెళుతున్నారు. అందుకే సింగరేణి సంస్థ పురుషులకే పరిమితమనుకున్న మైనింగ్ రంగంలో అవకాశం ఉన్న చోట మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది.

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నవశకం మొదలైంది. ఇప్పటి వరకు యాజమాన్యం మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించగా ఇక నుంచి మహిళా అధికారులు(మేనేజ్‌మెంట్ ట్రైనీ-మైనింగ్) సంస్థలో పనిచే సేందుకు అంతా సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాకు 22 మంది ఎంటీ(మైనింగ్) అధికారులను కేటాయించగా, ఇందులో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారు సోమవారం విధుల్లో చేరారు.



మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ మహిళా అధికారులు

బ్రిటీష్ నాటి కాలంలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి గ్రామంలో (ప్రస్తుతం ఇల్లెందు) 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పట్లో గునపాలతో బొగ్గును తొలిచి పైకి తీసుకొచ్చేవారు. బొగ్గు ఉత్పత్తిలో మహిళలు, బాలబాలికలు పాలుపంచుకునేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో మహిళలను భూగర్భంలో పనిచేయకుండా నిషేధం విధిస్తూ అప్పటి భారత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఆ తరువాత అవసరాలకు అనుగుణంగా మహిళలు సైతం గనుల్లో దిగి పనులు చేయవచ్చని గత చట్టాన్ని సవరించారు. దీంతో వారికి అవకాశాలు ఏర్పడ్డాయి.

నేరుగా ఉద్యోగావకాశం..

ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది మే నెలలో సింగరేణి నోటిఫికేషన్ ఇచ్చింది. పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్)గా 88 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 28 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం ఏరియాలో ఆరుగు రు, భూపాలపల్లి ఏరియాలో ఆరు గురు, ఆర్‌జీ-2 ఏరియాలో ఆరుగురు, ఆర్‌జీ-1 ఏరియాలో ఐదుగురు, శ్రీరాంపూర్ ఏరియాలో ముగ్గురు, మణుగూరు ఏరియాలో ఇద్దరు సోమవారం జాయిన్ అయ్యారు.

ఏడాది శిక్షణలోనే...

ఉద్యోగంలో చేరిన వారికి రెండు వారాల పాటు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. మొదటి మూడు రోజులు రక్షణపై స్థానిక వృత్తి శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తారు. దీంతో కలుపుకొని రెండు వారాల పాటు వివిధ విభాగాలపై అవగాహన, మరో రెండు వారాలు పని ప్రదేశాల్లో శిక్షణ ఉంటుంది. నూతన ట్రైనీలు నెలకోమారు తమ శిక్షణకు సంబంధించిన రిపోర్టును వీటీసీలలో సమర్పించాలి. ఆరు నెలలకు ఫేజ్-1, ఒక సంవత్సరానికి ఫేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తదుపరి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారు.

గతంలో కుటుంబ పెద్ద చనిపోతే..

సింగరేణిలో మహిళలకు గతంలో నేరుగా ఉద్యోగాలిచ్చే అవకాశం లేదు. కేవలం వారి కుటుంబ పెద్ద చనిపోతే ఉద్యోగం ఇచ్చేవారు. ఆ తరువాత 2018 నుంచి కారుణ్య విధానంలో నియామకాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యాప్తంగా సుమారు 1530 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. కాగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలు కార్యాలయాలు, విభాగాల్లో వివిధ పనులు చేస్తున్నారు. కానీ గనుల్లోకి దిగడం లేదు. గతేడాది జూన్ 24న అప్పటి వరకు ఉన్న సర్ఫేస్ పదం తొలగించి అండర్ గ్రౌండ్ అని సర్క్యులర్ జారీ చేయడంతో మహిళా ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లోకి దిగక తప్పదా అని చర్చ జరిగింది. ఆ తరువాత ఆ విషయం మరుగున పడింది.

శిక్షణ పొందిన తరువాతే విధులు

కల్లూరి వెంకట రామారావు, మేనేజర్, శ్రీరాంపూర్ వీటీసీ



సింగరేణిలో ఎవరు నియామకమైనా ముందుగా వృత్తి శిక్షణ కేంద్రం (వీటీసీ) ద్వారా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక్కడ బొగ్గు గనులు, వృత్తి సంబంధిత పనులు, విధులు, నిబంధనలు, నియమాలు, రక్షణ, తదితర విషయాలపై థియరీ నేర్చుకుంటారు. అనంతరం వృత్తి సంబంధిత పనులను గనుల్లోకి వెళ్లి తెలుసుకుంటారు. నూతనంగా మైనింగ్ అధికారుల బ్యాచ్ రావడం అభినందనీయం.

కష్టాలు ఎదుర్కొని..



ఈమె పేరు మాడిశెట్టి సాయిప్రత్యూష. జగిత్యాల జిల్లా డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామం. తండ్రి టైలర్‌గా పనిచేసేవాడు. సాయిప్రత్యూషకు నాలుగేళ్ల వయస్సున్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి రేణుక టైలరింగ్ పనిచేస్తూ ఆమెతో పాటు చెల్లెలు ప్రియాంకను చదివించింది. నాచుపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్, కొత్తగూడెంలో బీటెక్(మైనింగ్) చేసింది. ఆ తరువాత రాజస్థాన్‌లో శిక్షణ పొందింది. ఇటీవల సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం సాధించింది.

మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం..



ఈమె పుట్టపాక సుమ. జగిత్యాలవాసి. తండ్రి తిరుపతి కారు డ్రైవర్. తల్లి భాగ్యలక్ష్మి బీడీ కార్మికురాలు. సుమకు ఒక తమ్ముడు ఉన్నాడు. బీటెక్ చదువుతున్నాడు. జగిత్యాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ చదివింది. చదువు పూర్తికాగానే పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) గా ఉద్యోగం సాధించింది.

ఉన్నత విద్యావంతురాలు



పాపునూక లక్ష్మి సైతం జగిత్యాలవాసే. తండ్రి బుచ్చన్న స్థానికంగా ప్రైవేటుగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఇంకా ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. లక్ష్మి ఎస్ఎస్‌సీ, ఇంటర్ జగిత్యాలలో చదువగా, మంథని జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసింది. అనంతరం చెన్నై నుంచి ఎంబీఏ చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో బాగంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)గా ఉద్యోగం పొందింది.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, డిశంబరు 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయయ స్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాడభూసి శ్రీధర్ కుటుంబ సమేతంగా అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత మూర్తి కూడా అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్‌తో పాటు వెల్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, నూకపల్లి విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, హరిచరణ్‌రావు, సంపత్‌కుమార్ ఉన్నారు

● సమాచారం పొందడం పౌరుల హక్కు

ప్రభుత్వ కార్యాలయాలు తదితర సంస్థల నుంచి సమాచారం పొందడం ప్రతీ ఒక్కరి హక్కు అని సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాడభూసి శ్రీధర్ తెలిపారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ ప్రజలు దేనినైనా తెలుసుకోవచ్చునని అందించడం సంస్థలు, కార్యాలయాల బాధ్యత అని తెలిపారు.



రూపు కోల్పోయిన పూలవనం



గదికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఇసుక సంచులు

అశోక వనం

- కొండగట్టు అంజన్న పూలవనంపై శీతకన్ను
- ఎండిపోయిన మొక్కలు
- గుట్టల వరదనీటితో ఉనికి కోల్పోయిన పూలవనం

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలోని అశోక వనంపై అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉనికి కోల్పోతోంది. అందులోని పూలు, పండ్ల మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. గతంలో నిత్యం ఇక్కడి నుంచే స్వామి పూజలకు ఆలయ అలంకారానికి పూలు, పండ్లు, మామిడి ఆకులు తీసుకు వచ్చేవారు.

కొండపై నుంచి జేఎన్‌టీయూ వెళ్లే మార్గంలో బొజ్జపోతన గుడి సమీపంలో గల స్వామి వారి రెండెకరాల భూమిలో నిత్య పూజలకోసం పదేళ్ల క్రితం అశోకవనం పేరిట పూలు, పండ్లతోటలను పెంచడం ప్రారంభించారు. ఇందులో దాదాపు 500వరకు మామిడి, దానిమ్మ, జామ, ఎలక్కాయ, ఉసిరితో పాటు గులాబి, తులసి తదితర అనేక మొక్కలను పెంచారు. వాటి పర్యవేక్షణకు దేవస్థానం సిబ్బంది ఒకరిని నియమించారు.

గత హరిత హారం కార్యక్రమంలో భాగంగా మరిన్ని మొక్కలు కూడా నాటారు. అయితే కొన్నాళ్లుగా దానిపై నిర్లక్ష్యం కొట్టొస్తోంది. పూలు,పండ్ల తోటలలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ వాటి సంరక్షణ, పెంపునకు దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా దాన్ని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దేవస్థానం పారి శుధ్య సిబ్బందిచే కొన్నాళ్ల క్రితం వరకు అశోక వనంలో కలుపు తీయడం, మొక్కల సంరక్షణ చేసేవారు.

చర్యలు తీసుకుంటాం..: రామకృష్ణరావు, ఈవో

అశోకవనం సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. మరిన్ని వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు కూడా నాటిస్తాం. మొక్కల పెంపుకు చేపడుతాం. పూలు ఆలయానికి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటూ తరచూ పర్యవేక్షణకు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తాం. పూలవనంను అద్భుతంగా తీర్చిదిద్దుతాం.

గుట్టల వరదతో కనుమరుగు

వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టల నుంచి వచ్చిన వరదకు పూలవనం ఇసుక దిబ్బలతో నిండి రూపు కోల్పోయింది. సమీపం గుట్టల నుంచి వచ్చే నీరు వెళ్లడానికి గతంలో కాంటూరు కందకాలు, వాటి ముందు కాలువలు ఉండగా ఇటీవల కందకాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. దీంతో కాలువ కనుమరుగు అయిగుట్టల నీరంతా పల్లపు ప్రాంతంలో ఉన్న పూలవనంలోకి వరద వస్తోంది. దీంతో అక్కడ గల పూలవనం కొట్టుకుపోగా గదికి అడ్డంగా ఇసుక సంచులు వేశారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని తరచూ పర్యవేక్షిస్తూ అశోకవనం మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది.



డ్రిప్ పరికరాల వద్ద బయట నుంచి వస్తున్న నీరు

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన కాలనీలో దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు(50)ని మంగళవారం బైపాస్ రోడ్‌లోని గౌతమినగర్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ ఒకటవ టౌణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నవంబరు 23న శాతవాహన కాలనీలోని ఉప్పుగుండ్ల మురళీకృష్ణకు చెందిన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. మంగళవారం గౌతమినగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా సత్యనారాయణ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జడ్జి ఆదేశాలతో సత్యనారాయణను రిమాండ్‌కు తరలించాలని తెలిపారు. నిందితుడిపై గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు నమోదయ్యాయని, శిక్ష కూడా అనుభవించాడనిసీఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకులు ఎం.నాగ్లేశ్వర్ తెలిపారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం ఎస్సీ రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థులు కళాశాలలు తమ దరఖాస్తులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థులతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా శ్రద్ధ వహించాలని కోరారు.

గీతాజయంతి ఉత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలను ఆలయ స్థానాచార్యులు అప్పాల బీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం గీత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అద్దాల మండపంలో స్వస్తి పుణ్య హవచనం, మంటప ప్రవేశం స్వామి వారికి మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలను వేదమంత్రాలతో చేపట్టారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు గీతా హోమం ఘనంగా నిర్వహించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులతో భగవద్గీత పఠనం చేయించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయ అద్దాల మండపంలో శ్రీమద్భాగవతము దశమస్కంద పురాణ ప్రవచనము చేశారు.

రాజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ అలం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయి

జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్



మాట్లాడుతున్న మాఢబూసి శ్రీధర్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మనిషి పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయని అవి ఎవరో ఇచ్చేవి కావని జాతీయ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జతీయ మానవ హక్కుల సమాఖ్య జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాలలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాడభూషి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగే హక్కు, ఆలోచించే హక్కు జీవించే హక్కు ఇవన్నీ ఎవరి ద్వారానో రాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం ద్వారా మనకు మరిన్ని హక్కులు సంక్రమించాయన్నారు.కార్యక్రమంలో తెలంగాణ మానవ హక్కుల సమాఖ్య ఫౌండర్, చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం, ఉపాధ్యక్షులు సందీప్‌రావు, ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రతినిధి ప్రశాంత్‌రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్ప చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై రెండు రోజులుగా గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్నారు. ప్రతి నిత్యం ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో రోడ్లు అవుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రెండు రోజులుగా పచ్చునూర్, ఊటూర్ గ్రామస్థులు, మండల కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టి లారీలను అడ్డుకున్నారు. ఊటూర్ క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఓవర్ లోడ్‌తో ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఇసకలారీలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మానకొండూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండెల మహేందర్, మండల యూత్ అధ్యక్షులు కోండ్ర సురేష్, ఎర్రోల్ల కవిత, కనకం అశోక్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఊటూర్-పచ్చునూర్ గ్రామాల మధ్య నిలిచిన ఇసుక లారీలు

క్రీడలతో మానసికోల్లాసం

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. బాలుర విభాగంలో కరీంనగర్ 1వ స్థానం, మహబూబ్ నగర్ 2వ స్థానం, ఖమ్మం 3వ స్థానం, బాలి కల విభాగంలో ఖమ్మం 1వ స్థానం, కరీంనగర్ 2వ స్థానం, హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచాయి.



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

న్యాక్ బృందం గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శన

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం మంగళవారం సందర్శించింది. బృందం సభ్యులు రెండు రోజుల పాటు కళాశాలలోని వివిధ విషయాలపై అధ్యయనం చేసినట్లు ప్రిన్సిపల్ రెహానా ఇఫత్ తెలిపారు. కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు, అవలంభిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను షీల్డ్ కవర్‌లో బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్య, కోఆర్డినేటర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాక్ బృందంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో విసిగిపోయిన ప్రజలు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్



బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, 66 మోసాలు పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా నిర్వహిస్తున్న పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు బీజేపీ ఉద్యమిస్తోందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అని స్పష్టం చేశారు. సమావేశంలో గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజీ, లావణ్య, ఊశ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగేడ రాజేశ్వర్‌రావు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమలో నాయకులు కూకట్ల నాగరాజు, గోమాస శ్రీనివాస్, గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి, సోమారపు లావణ్య, సంధ్యారాణి, ఎస్ఎస్‌సీ వనజ, అశోక్‌రావు, రాజన్నపటేల్, కందునూరి కుమార్, పవన్, కుమార్‌రెడ్డి, వేగోళం శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

రామగుండంలో మొదలైన 'ఇందిరమ్మ' సర్వే

- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు పకడ్బందీ వెరిఫికేషన్
- జీపీఎస్ ఫొటోలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక వెరిఫికేషన్ నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌ను ఈ సర్వేలో ఉపయోగిస్తున్నారు. పేదల్లో నిరుపేదలకు మొదటి దశలో ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ఇందిరమ్మ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఉంచారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ యాప్‌లో వివరాల ఆధారంగా వెరిఫికేషన్ చేస్తున్నారు. యాప్‌లో పలు అంశాలను కీలకంగా పెట్టారు. ముఖ్యంగా గతంలో ఇందిరమ్మ లబ్ధిదారులు, రేషన్‌కార్డులు, దరఖాస్తుదారులకు స్థలం ఉందా అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఫొటోలు అప్‌లోడ్..

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి వెరిఫికేషన్‌లో ఈ సారి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా యాప్‌లో ప్రస్తుతం నివాసముంటున్న ఇల్లు సొంతమ, అద్దెనా, ఏ రకమైన కట్టడం అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

ఇంటిబయట, పైకప్పు, లోపల జీపీఎస్‌తో అనుసంధానం చేసి ఫొటోలు తీస్తున్నారు. ఇల్లు రేకుల ఇల్లా, స్లాబా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్లకు సంబంధించే 12రకాల ఆప్షన్లు ఇచ్చారు. సొంత స్థలం, ప్రభుత్వ స్థలం, ప్రభుత్వం నుంచి పట్టా తీసు కున్న స్థలం,రెగ్యులరైజ్ అయిన స్థలం, అసైన్డ్, గ్రామ కంఠం తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. స్థలానికి సంబంధించి సేల్‌డీడ్‌లు, ఇతర వివరాలు తీసుకుంటున్నారు. ఒకవేళ నివాసముంటున్న ప్రాంతానికి స్థలం దగ్గరలోనే ఉంటే ఆ స్థలం వద్ద దర ఖాస్తుదారుల ఫొటోతో పాటు రేఖాంశాల వివరాలను పొందుపరుస్తున్నారు.

మూడు విడతల్లో నిధులు..

ఇందిరమ్మ పథకానికి అర్హులైన పేదలకు మొదటి దశలో నియోజకవర్గానికి 3500 మంజూరు చేస్తారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి మూడు విడతల్లో రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తారు. నిర్మాణానికి సంబంధించి జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌తో ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ పథకం అర్హుల ఎంపికకు సర్వే మొదలైంది. నగర పాలక సంస్థ పరిధిలో 50డివిజన్లు ఉండగా ఆయా డివిజన్ల బిల్ కలెక్టర్లు, సహాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ఆధారంగా ఈ సర్వే చేస్తున్నారు. రామగుండం అర్బన్‌లో మొదటి రోజు జరిగిన సర్వేలో ఎక్కువ వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నట్టు తెలుస్తుంది. కాగా 20ఏళ్ల క్రితం సింగరేణిలో గోల్డెన్ షేక్ హ్యాండ్, వీఆర్ఎస్‌లతో పదవీ విరమణ చేసిన వేలాది మంది కార్మిక కుటుంబాలు గూడు లేక ఇప్పటికీ అద్దె ఇండ్లలోనే ఉంటున్నారు.

పాత లబ్ధిదారులకు నో ఛాన్స్..

ఇందిరమ్మ పథకంలో గతంలో లబ్ధిదారులుగా ఉన్న వారికి అవకాశం ఇవ్వరు. దీంతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు, పక్కా ఇండ్లు, ఖరీదైన స్థలాలు ఉన్న వారు, ఫోర్‌వీలర్స్ యజమానులకు అవకాశం ఉండదు. ఈ పథకం క్రింద అర్హులను గుర్తించి ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్య తనిస్తారు.

న్యూస్ బాక్స్

క్రీడా దుస్తులు అందజేత

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్రీడా దుస్తులను మంగళవారం ప్రముఖ వ్యాపార వేత్త కోడం విష్ణు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని రేపాకలో 20 మంది క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయిని రాధారాణి మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని రేవతి, మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన అడ్వకేట్ దండు కరుణాకర్, అయన కుమారుడు మణికంఠుడు దండు అద్వైత్ చేపట్టిన మహా పడిపూజ మహోత్సవాన్ని రాచ విద్యాసాగర్ గురుస్వామి నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ప్రయాకర్‌రావు మధుసూదన్, బల్కి రమేష్ పంతులు, కౌన్సిలర్లు కల్లూరి రాజు, దేవదాస్ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని యాదవ సంఘం సభ్యులకు ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జస్వంత్, మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, యాదవ సంఘం అధ్యక్షుడు నారాయణ, మల్లేశం, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు

గంభీరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ క్రీడా మైదానంలో మంగళవారం సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే పోటీలు నిర్వహించనున్నారు. ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో గంగరాం, ఈవో లక్ష్మన్, ఎస్టీఎఫ్ కన్వీనర్, పీడీ బాను, హెచ్‌ఎంలు శ్రీనివాస్, అశోక్, బాలెల్లయ్య, పీడీ, పీఈటీలు నరేష్, సంధ్యారాణి, బానురేఖ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరుబాట

5వ పేజీ తరువాయి..

భవాని, నీరజ, సలీం, నరేందర్, శ్రీనివాస్, రవి, నరేష్, నగేష్, దేవరాజు, చందన్, శ్రీలత, లావణ్య, పద్మ, జ్యోతి ఉన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు

- సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. అప్పటి వరకు పే స్కేల్ కల్పించాలి.
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఉద్యోగ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ కింద రూ. 25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెయిటేజీ కల్పించాలి.
- పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి.
- టీఎస్‌ఎస్ ఉద్యోగులకు రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.



సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టిన సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రభుత్వం మాట నిలుపుకోవాలి



విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తక్కువ వేతనంతో ఎక్కువ పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి సమస్యలను విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. మా డిమాండ్లు నెర వేరే పోరాటం కొనసాగిస్తాం.

- నీరజ, ఉద్యోగిని

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. అప్పటి వరకు ఉద్యోగులకు పే స్కేల్ అందించాలి. 15 రోజుల క్రితమే ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చాం. మూడు రోజులు రిలే దీక్షలు చేపట్టాం. ప్రభుత్వం స్పందించకపోవడం తోనే నిరవధిక సమ్మెకు దిగాం. ఇప్పటికీ స్పందించ కుంటే పోరాటం ఉధృతం చేస్తాం.

- జయ, ఉద్యోగిని

ప్రభుత్వ శాఖల్లో వెయిటేజీ ఇవ్వాలి



ప్రభుత్వ శాఖలు, అలాగే విద్యాశాఖ నియామకాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలి. తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలి. విద్యారంగంలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పట్టించుకోకపోవ డం బాధాకరం.

- చంద్రమౌళి, ఉద్యోగి

రోడ్డెక్కినా పట్టించుకోవడం లేదు



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి. ఉద్యోగులందరూ నిరవధిక సమ్మెతో రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

- దేవేందర్, ఉద్యోగి

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవిత బీమా కింద రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. పే స్కేల్ ఇవ్వాలి. పీటీఐలకు వేతనాలు ఇవ్వాలి.

- నరేందర్, ఉద్యోగి

'భానుతో దెబ్బతింటున్న రాజకీయాలు'

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు అన్నల్‌దాస్ భానుతో సిరిసిల్ల పట్టణ రాజకీయాలు దెబ్బతింటున్నాయని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో ఇతరుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన పోస్టులు పెట్టేముందు ఆలోచన చేయాలన్నారు. వ్యక్తిగత విషయాలపై తాము సోషల్ మీడియాలో పోస్టులు పెట్టలేదన్నారు. చక్రపాణి రౌడియిజం చేస్తున్నాడంటూ విమర్శలు చేశాడని పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ అధికారం ఉండి కూడా ఎక్కడా రౌడియిజం చేయలేదని అ న్నారు. సిరిసిల్లలో రాజకీయంగా మంచి వాతావరణం ఉందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు పార్టీల పరంగా పోటీపడడం తదనంతరం అభివృద్ధికి సహకరించాలన్నారు.

అభివృద్ధిపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విగ్రహాలను మార్చడం కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిపై దృష్టిసారించాలని, ఎవరి ఆనవాళ్లను ఎవరూ చెరిపివేయలేరని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి సచివాలయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం కొత్తబ స్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతంతో కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రావుతో కలసి మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చావునోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్ర సాధనలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్నారని, అందులో భాగంగానే తెలంగాణ చిహ్నంతోపాటు టీఎస్‌ను టీజీగా మార్చారని, ఇప్పుడు తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి ఆవిష్కరించారని అన్నారు. పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ మురళి, కౌన్సిలర్లు అరుణలక్ష్మీనారాయణ , రాజిరెడ్డి, అరుణ, శ్రీనివాస్, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ శంకరయ్య, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వార్డుల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి పాలక వర్గం ప్రాధాన్యం ఇస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం 23వ వార్డులో సీసీ రోడ్డు, డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ 23వ వార్డులో మూడున్నర లక్షల జనరల్ నిధులతో డ్రెయినేజీ పనులు చేపట్టినట్లు చెప్పారు. అనుకున్న సమయానికి ముందే పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ రాపెల్లి అరుణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ మున్సిపల్ ఏఈ నరసింహస్వామి పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న చైర్ పర్సన్

అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం పలువురు నాయకులు అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మావేశంలో నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ చౌరస్తా సుందరీకరణ, డిజైన్ రూపొందించేందుకు ప్రజా సంఘాల అభిప్రాయాన్ని తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరుతామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, గోలి మహేష్, ఆనంద్, అంజిబాబు, థామస్, మూలే కిషోర్, రాములు, యాదగిరి, శ్రీధర్, శ్రీకాంత్, సతీష్, కిరణ్, మనోజ్‌కుమార్, మహేశ్వర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ కోసం సాగిన ఉద్యమ చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం వక్రీకరిస్తోందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఆయుధంగా పని చేసిందని, అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తొలగించి ప్రజల బతుకులను ఆగం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డి ఏనాడూ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించలేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో జైబోలయ్య అనే పాటను పెట్టడం ద్వారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నడుస్తోందని అర్థం చేసుకోవచ్చన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు ఒగ్గు నర్సయ్య, కేవీఎస్‌రెడ్డి, ఉడుతల వెంకన్న, కట్ట వెంకటరెడ్డి, వెంకటేశం, పర్శరాం, సాదుల్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సిరిసిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం సీఎం కప్ సిరిసిల్ల మున్సిపల్ స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లావణ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో మండల స్థాయి సీఎం కప్ పోటీలను నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఎంఈవో కృష్ణహరి పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్‌తో పోటీలు ప్రారంభించారు. తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఎస్ఐ ఎల్లాగౌడ్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపలి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం, నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను మండలంలోని గాలిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య ప్రారంభించేవారు.

రుద్రంగి : గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. ఎంపీడీవో నటరాజు, మాజీ జడ్పీటీసీ మీనయ్య, మాజీ సర్పంచ్ ప్రభలత మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామికం



వేములవాడలో నినాదాలు చేస్తున్న ఆశా కార్యకర్తలు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్ల అరెస్టు అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి మంగళవారం తెల్లవారుజామున చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న 42 మంది ఆశావర్కర్లను, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా నాయకులు మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్‌ను పోలీసులు అరెస్టులు చేసి సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆశావర్కర్ల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలో ఆశావర్కర్లను ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం ముందు ఆశావర్కర్లతో మంగళవారం నిరసన తెలిపారు.సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: హైదరాబాద్‌కు వెళ్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆశా కార్యకర్తలను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సొల్లు శాంత మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: చలో హైదరాబాద్‌కు తరలుతున్న ఆశా కార్యాకర్తలను ముస్తాబాద్ పోలీసులు ఠాణాకు తరలించారు.

వేములవాడ : అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆశా కార్యకర్తలను వేములవాడ పట్టణ పోలీసులు మంగళవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ అసెంబ్లీ ముట్టడికి ఆశా కార్యకర్తలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని మధ్యాహ్నం 12 గంటల అనంతరం వ్యక్తిగత పూచి మీద వదిలిపెట్టారు. సీఐటీయూ నాయకులు గుర్రం అశోక్, నాయకులు ముక్తికాంత అశోక్ మాట్లాడుతూ హక్కులే ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తోందని ఆరోపించారు.

చందుర్తి : ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం స్వంత పూచీ కత్తుపై విడుదల చేశారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలంలోని ఆశా వర్కర్లను కోనరావుపేట పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిశారు. ఇల్లంతకుంట నుంచి వెంకట్రావుపల్లె మీదుగా సిద్దిపేటకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎంపీపీ తెలిపారు.

పాఠశాలల్లో నిలిచిన మధ్యాహ్న భోజనం

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమ్మెతో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం నిలిచిపోయింది. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, రెండు రోజులు వంటచేయలేమని నోటీసు అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకోగా మరికొంత మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సచివాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం రూపు రేఖలు మార్చి ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ చరిత ఉట్టి పడేలా తీర్చిదిద్దిన విగ్రహాన్ని మార్చడం మూర్ఖత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ రేణుక, నాయకులు శ్రీనివాస్, మోహన్, మజీద్, శివరామకృష్ణ, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, దేవరాజు, పర్శరాములు, బాబు, తిరుపతి పాల్గొన్నారు.

సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ భారత పౌరుడు కాదంటూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్ కుడికాల రవీకుమార్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్, ఆడెపు చంద్రకల, వెంగళ లక్ష్మీనర్సయ్య, ఆడెపు ప్రభాకర్, టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో వంద శాతం సాధించేలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పర్శరాములు, అధ్యాపకులు సత్యనారాయణ, విష్ణు ప్రసాద్, చంద్రమౌళి, సాగర్, భూమక్క, కవిత, ప్రవళిక, గౌతమి, గీత ఉన్నారు.

నెలాఖరులోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ గణన 2021 - 22 ఫేజ్ 2, ఫేజ్ 3ని ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ గణన కోసం నియమించిన మండల వ్యవసాయ అధికారులు, సెన్సెస్ చాట్ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఫేజ్ 3లో ఎంపిక చేసిన 21 గ్రామాల్లో వివరాలు సేకరించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మధ్యాహ్నభోజన కార్మికుల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి

వీర్నపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కన్జూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరం చైర్ పర్సన్ నారాయణ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహించారు. విద్యుత్ పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించాలం టూ ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట నుంచి రెండు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు రిలే నిరాహార దీక్ష

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ధర్మ సమాజ్ పార్టీ, విద్యా, ఉపాధి, భూమి, ఇళ్ల సాధన జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ ఎడపెల్లి బాబు మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఇళ్లు, భూమి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చిన ప్రభుత్వం నుంచి స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం స్పందించాలని ఈ రోజు రిలే నిరాహార దీక్షను ప్రారంభించామన్నారు.

చెన్నమనేని రమేష్ బాబుకు జైలు శిక్ష విధించాలి

చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చి చెప్పిన నేపథ్యంలో జైలు శిక్ష విధించాలని చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో ప్రజలను, న్యాయస్థానాన్ని, అధికారులను తప్పుదోవ పట్టించినట్లు హైకోర్టు తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

గీసుకొండకు రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మునుగొండ చెందిన రాంబాబు అనే వ్యక్తి వేములవాడ రాజరాజేశ్వరస్వామి గోశాల కోడెలను తరలించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆలయ అధికారులు మంగళవారం గీసుకొండ బయలుదేరినట్లు తెలుస్తోంది. ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ సూపరింటెండెంట్ నర్సయ్య, మరో ఉద్యోగి రవి వరంగల్ జిల్లాకు చెందిన రైతుల రికార్డులతో వెళ్లినట్లు, ఈ విషయమై బుధవారం విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.